# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ని తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- ❖ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కీలక సంస్కరణలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రైవేట్ పరం చేయడం లేదని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణ బాబు స్పష్టం చేశారు.
- ❖ గన్నవరం విమానాశ్రయానికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ త్వరలో అందుబాటులోకి రానుందని మచిలీపట్నం లోక్ సభ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు.

======================

భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ని తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో "మీ భూమి- మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2027 మార్చి నాటికి 9,833 గ్రామాలలో 72,70,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. కట్టుదిట్టమైన విధానాలతో తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆటో మ్యుటేషన్ ద్వారా వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

రాష్ట్రంలో రైతులకు నమ్మకం, భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గత రెండేళ్లుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కీలక సంస్కరణలు అమలు చేస్తోందని ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గడచిన రెండేళ్లలో ధాన్యం సేకరణ ప్రగతిపై విజయవాడలో సమీక్ష సమావేశాన్ని ఈరోజు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ధాన్యం సేకరణ చేపట్టామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం రెండో ఏడాదిలోనే 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వెల్లడించారు. 31 వేల కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, 11 లక్షల 53 వేల మంది రైతులకు 95 శాతం చెల్లింపులను 24 గంటల్లోనే వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

=====================

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు వంద శాతం ఖర్చు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన నోడల్ ఏజెన్సీ సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది ఎస్సీ సబ్ ప్లాన్ కు 20 వేల 643 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. ఆ నిధులను వచ్చే జనవరిలోగా 100 శాతం ఖర్చు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. విభాగాల వారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు.

=====================

మచిలీపట్నానికి మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం రూరల్ మండలం క్యాంబెల్ పేట పరిధిలో తాగునీటి పైపులైన్ అభివృద్ధి పనులను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాలనీల్లోని రోడ్లకు కూడా త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. “జల్ జీవన్ మిషన్” పథకంలో భాగంగా మచిలీపట్నానికి 200 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు.

=====================

గన్నవరం విమానాశ్రయానికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ త్వరలో అందుబాటులోకి రానుందని మచిలీపట్నం లోక్ సభ సభ్యులు వల్లభనేని బాల శౌరి తెలిపారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ నిర్మాణ పనులపై ఎయిర్ పోర్ట్ అడ్వైజరి కమిటీ సమావేశం ఈరోజు నిర్వహించారు. ఎయిర్ పోర్టు అడ్వైజరీ కమిటీ ఛైర్మన్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కో ఛైర్మన్ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), వైస్ ఛైర్మన్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులతో బాల శౌరి మాట్లాడుతూ... షార్జా, సింగపూర్ తో పాటు శ్రీలంకకు ప్రత్యేక విమానం, దుబాయ్ ఎమిరైట్స్ విమాన సర్వీస్ ను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదే విధంగా వారణాసి, కలకత్తా, కొచ్చి నగరాలకు ప్రత్యేక స్వదేశీ విమాన సర్వీసులను నడిపాలని కోరుతున్నామని చెప్పారు.

విరామం

=====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రైవేట్ పరం చేయడం లేదని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. టి. కృష్ణ బాబు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ... విద్యుత్ బస్సుల విషయంలో ఆర్టీసీ ఉద్యోగులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఉన్న ఉద్యోగులను తొలగించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పారు. 74 శాతం బస్సులను ఆర్టీసీ నడుపుతోందని

పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో అన్ని ఆర్టీసీ బస్ లను విద్యుత్ బస్సులుగా మార్పు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=====================

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపును పరిశీలించాల్సిన అవసరం ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వైద్య కళాశాలలో ప్రొఫెసర్ల పోస్టుల్లో ఖాళీలు అధికంగా ఉన్నాయని చెప్పారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో బడ్జెట్, కేంద్ర సహాయం వినియోగం తీరుపై ఉన్నతాధికారులతో మంత్రి ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో దాదాపు 800 ప్రొఫెసర్ల పోస్టులకు గాను 200 ఖాళీ ఉండడంతో దాని ప్రభావం వైద్య విద్య ప్రమాణాలపై పడుతోందన్నారు. ఫలితంగా పీజీ సీట్లను కోల్పోయే పరిస్థితి ఎదురవుతోందని మంత్రి చెప్పారు. ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపు అంశాన్ని ప్రభుత్వం పరిశీలించేందుకు సమగ్ర ప్రతిపాదనను రూపొందించాలని అధికారులను సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

=====================

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. అధికమాసం కారణంగా తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రణాళికలు రూపొందించి నిర్దేశిత సమయంలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని విభాగాధిపతులను ఆయన ఆదేశించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలపై తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో ఉన్న సుధర్మ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆయన ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టబోయే ఏర్పాట్లపై విభాగాల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

=====================

లబ్ధిదారుల గృహాలపై పెండింగ్ లో ఉన్న సోలార్ యూనిట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ అంశాలపై విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సోలార్ ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి జిల్లాలో మొత్తం 6,882 మంది లబ్ధిదారులను వెండర్లు ఎంపిక చేసుకున్నారని చెప్పారు. ఇప్పటివరకు 3,567 లబ్ధిదారుల గృహాలపై సోలార్ వ్యవస్థల ఏర్పాటు పూర్తయ్యాయన్నారు. మరో 1,405 సౌర ఫలకల ఏర్పాటు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని, మిగిలిన 1,910 మంది లబ్ధిదారులకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు, పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు.

=====================

రాష్ట్రంలో రేపు మేఘావృతమైన వాతావరణంతో పాటు పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఉత్తరాంధ్ర, కోనసీమ, ఏలూరు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని సూచించారు.

=====================

=====================